రైతన్నలకు తెగులు దిగులు..

- వరిపైరుపై తెగుళ్ల పంజా
- వాతావరణ మార్పులే కారణం
- దిగుబడి తగ్గుతుందని ఆందోళనలో రైతులు


ధూళికట్టలో వరి పైరుకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

ఎలిగేడు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులకు పెట్టుబడి కూడా మిగలడం లేదు. ఓ వైపు అన్ని ధరలు పెరిగినా.. రైతులు సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధర లభించడం లేదు. వీటన్నింటికి తోడు రైతన్నపై మరో భారం పడుతోంది. యాసంగిలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో వరి పైరుపై అగ్గితెగులు, పాముపొడ తెగలు సోకి ఇబ్బంది పడుతున్నారు దీంతో పైరు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అధికారుల సలహాలు, సూచనల మేరకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

అధిక విస్తీర్ణంలో వరిసాగు

ఎలిగేడు మండలంలో యాసంగి సీజన్‌లో రైతులు అధికశాతం విస్తీర్ణంలో వరిపంటనే సాగు చేశారు. ఇప్పటికే సాగు ఖర్చు, కరెంట్ సమస్యతో సతమతం అవుతున్న తరుణంలో మరోపక్క వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో వరి పైరుపై తెగుళ్ల సోకి ఆశలు ఆవిరవుతున్నాయి. ఎన్ని పురుగుల మందులు పిచికారి చేసినా తగ్గు ముఖం పట్టడంలేదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరుపై అగ్గితెగులు, పాముపొడ తెగులు సోకిందని, జింక్‌లోపం ఏర్పడి ఎర్రబారుతున్నాయయనిరైతులు పేర్కొంటున్నారు.

13 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు

మండలంలో పూర్తిస్థాయి ఎస్సారెస్పీ ఆయకట్టు కావడంతో వ్యవసాయబావుల్లో సమృద్ధిగా నీటి వనరులు ఉండటం, చెరువులు,కుంటల్లో సైతం సాగు నీరు ఉండటంతో రైతులు ఎక్కువగా వరి సాగు చేశారు. ఈ యాసంగిలో సుమారు 13,500 ఎకరాలకు పైగానే వరి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. వరి పంటకు కొద్ది రోజుల నుంచి తెగుళ్ల ఆశిస్తున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు వరి పైరులను క్షేత్రస్థాయిలో సందర్శించి సస్య రక్షణకు చర్యలు, సలహాలు సూచనలు అందజేయాలని కోరుతుండగా అందుకనుగుణంగానే వ్యవసాయశాఖ అధికారులు ఏవో, ఏఈవోలు ఫీల్డ్‌పై సందర్శించి, రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

తెగులు సోకడానికి కారణం..

వరిలో తెగులు సోకటానికి రాత్రిపూట ఉష్ణోగ్రత 18 నుంచి 22 వరకు ఉండి గాలిలో తేమ 90 శాతం ఉన్నప్పుడు, చిన్న, చిన్న వర్షపు జల్లులు కురిసినట్లెతై వరి పైరుపై అగ్గితెగులు సోకుతుందని వ్యవసాయశాఖ అధికారులు, నిపుణులు, అనుభవజ్ఞులు పేర్కొంటున్నారు. వాతావరణం ఇలా ఉన్నప్పుడు యూరియా ఎక్కువ వేయొద్దని, ఎక్కువగా వేస్తే తెగులు మరింత ఉధృతం అవుతుందన్నారు. ఈ తెగులు సోకిన ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు, నూలు కండె ఆకారంతో మచ్చలు ఏర్పడతాయన్నారు.

తెగుళ్ల నివారణకు....

అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి. పాముపొడ తెగులు నివారణకు ఎగ్జాకోనజోల్ లేదా వాలిడామైసిన్ మందులను 250 ఎంఎల్ పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

నాలుగు సార్లు మందులు స్ప్రే చేశా



పొలానికి వివిధ రకాల తెగుళ్ల సోకడంతో ఇప్పటికీ నాలుగు సార్లు మందులను పిచికారీ చేశాను. పెట్టుబడి పెరగడంతోపాటు, తెగుళ్ల సోకడంతో దిగుబడిపై భయంగా ఉంది. దీంతో ఇబ్బందులు పడుతూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. రైతులకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– నందినేని శంకర్ , రైతు ధూళికట్ట

సలహాలు, సూచనలు ఇస్తున్నాం



మండలంలో పలు గ్రామాల్లో వరి పంటలో వాతావరణ మార్పులతో అగ్గితెగులు, పాముపొడ వంటి తెగుళ్ల సోకుతున్నాయి. మండలంలో ఏఈవోల ద్వారా రైతులకు తెగుళ్లను అరికట్టేందుకు సలహాలు, సూచనలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. రైతులు అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలసుకోవచ్చు.

– ఉమాపతి, మండల వ్యవసాయశాఖ అధికారి, ఎలిగేడు

క్లుప్తంగా

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాబు

ఎలిగేడు: అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపెల్లి బాబు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 8 ఏళ్ల నుంచి డబుల్ బెడ్ రూమ్ అర్హులను ఎంపిక చేయకపోగా, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు మంజూరు చేశారో వాటి వివరాలు తెలపాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తున్నామని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తోందన్నారు, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గ కార్యదర్శి కోడూరు చంద్రమౌళి నేత, కోశాధికారి ఎండీ రియాజ్ ఎలిగేడు మండల అధ్యక్షుడు మారం సతీశ్ యాదవ్, బీబీఎఫ్ నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన నిరుద్యోగులు ఉపాధి కల్పించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థలో వీటీసీ ట్రెనింగ్ పూర్తి చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆర్జీ–1 జీఎం స్పందించి 10 మందికి విటీసీ ట్రెనింగ్ ఇప్పించి మాకు ఓసీపీ–5 ప్రాజెక్టు నందు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు నెరవేరలేదని, వెంటనే ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిడుగు గట్టయ్య, మెరుగు రవి, పోతం రాయమల్లు, జనగామ శంకర్, రాజేందర్, సిద్దం కనకయ్య, పోతే రవి తదితురులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు


మొక్కలు నాటుతున్న అధికారులు

పాలకుర్తి: రైతులు ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి శశిధర్ అన్నారు. సోమవారం మండలంలోని ఈసాల తక్కళ్ళపల్లి ఆయిల్ పాం సాగు చేస్తున్న కడారి శంకరయ్య వ్యవసాయక్షేత్రాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం మొక్కలను రాయితీపై అందజేస్తుందని, డ్రిప్‌పై 90శాతం రాయితీపై హార్టికల్చర్ అందిస్తున్నారని తెలిపారు. అవసరమున్న రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, ఏఈవో యోజన, సర్పంచ్ ముక్కెర రాజకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ నాగేశ్, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ సోమవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని చెప్పి హామీ ఇచ్చినా నేటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. రిటైర్డ్ అవుతున్న కార్మికులకు వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదని, ఎవరి కేటాయించిన క్వార్టర్ వారికే అప్పగించాలని కోరారు. క్వార్టర్ లేని కార్మికులకు 250 గజాల స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లి మొగిలి, ఆసరి మహేశ్, ఎస్కే గౌస్, రాజమౌళి, దాసరి సురేశ్, సతీశ్‌కుమార్, శ్రీనివాస్, రాయమల్లు, శంకర్, ఆడెపు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా కుంభాభిషేకం


సహస్ర కలశపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

మంథని: పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ 15 వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగురోజులుగా గణపతి,సుబ్రమణ్య, శివ, విష్ణు, జ్ఞాన సరస్వతి, ప్రసన్నాంజనేయ స్వామి, నవగ్రహాలు, ధ్వజ స్తంభానికి కేరళ తాంత్రిక విధానంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అయ్యప్పస్వామి మూల విరాట్‌కు 1008 జంటలచే సహస్ర కలశ అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, తహసీల్దార్ బండి ప్రకాశ్, డెప్యూటి తహసీల్దార్ గిరి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు అందజేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో ఇటుకబట్టిల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను దళిత బహుజన లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసం, ఇటుక బట్టి యాజమాని లక్ష్మణ్‌రావు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తుల ర్యాలీలో బీజేపీ నాయకులు


సైఫ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి:వైద్య విద్యార్థి దరావత్ ప్రీతి ఆత్మహత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ పాలకుర్తి మండల నాయకులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం నిర్భయ, ఫోక్సో వంటి చట్టాలతో పాటు షీ టీమ్స్ ఏర్పాటు చేసినప్పటికీ మహిళలకు రక్షణ లేకపోవడం శోచనీయమని, ప్రభుత్వం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

పాలకుర్తి: మెడిసిన్ విద్యార్థిని ప్రీతి నాయక్ మృతికి సంతాపంగా సోమవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద స్థానిక బీజేపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు తొగరి తిరుపతి, కంకటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో ..

జ్యోతినగర్: కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి సంతాపంగా కొవ్వొత్తులను వెలిగించి ఘనంగా నివాళి అర్పించారు. సోమవారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్, అన్నపూర్ణకాలనిలో హిందూవాహిని రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో పైతరి రాజు, రాగం శ్రీధర్, కత్తెరమల్ల పవన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కారకులను ఉరి తీయాలి

రామగుండం: డాక్టర్ ప్రీతినాయక్ మరణానికి కారకులైన వారికి ఉరి శిక్ష వేయాలని ప్రజాపంథా డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో మహిళలు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మహిళలు మార్త రాధ, పెండ్యాల లక్ష్మి, స్వరూప, పాల్గొన్నారు.

సైఫ్ దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖనిటౌన్: మెడికో విద్యార్థి ప్రీతి మృతికి కారణమైన సైఫ్ దిష్టిబొమ్మను ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి రేణికుంట్ల ప్రీతం ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ ప్రీతి మృతికి కారణమైన ఎంఎ సైఫ్‌ను ఉరితీయాలని, ర్యాగింగ్‌ను నియంత్రించలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రీతి మృతికి బాధ్యత వహించాలని, ప్రిన్సిపాల్, హెచ్‌వోడీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాతంగి సాగర్, ధనాల దినేష్, గంద్రెటి శివ, చిరంజీవి, ఆకాంక్ష, సీతల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కరోత్సవం


పూజలో పాల్గొన్న ఆర్జీ–2 జీఎం, భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి త్రయాహ్నిక చతుష్కుండాత్మక తృతీయ పుష్కరోత్సవాలను శ్రీత్రిదండి చిన్నశ్రీమన్నారాయణరామానుజజీయర్ స్వామి పర్యవేక్షణలో సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పుష్కరోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆర్జీ–2 జీఎం మనోహర్ దంపతులు 9 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు జగన్నాథాచార్యులు, మధుసూదనాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల్లో సదుపాయాలు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఓదెల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓదెల మండలం కొలనూర్‌లో ఈజీఎస్ కింద రూ. 20 లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ పల్లె సీసీరోడ్లతో అద్దంలా ముస్తాబైందన్నారు. జిల్లా కేంద్రానికి ప్రతి మండలం నుంచి డబుల్ రోడ్లు ఏర్పాటు అయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచ్ సామ మణెమ్మ, ఉపసర్పంచ్ పాకాల సంపత్ రెడ్డి, , బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కావటి రాజు, బండారి ఐలయ్య యాదవ్, మ్యాడగొని శ్రీకాంత్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు గాండ్ల మల్లేశం, మానస, నాయకులు వెంకటేశం, సంపత్, సరోత్తం రెడ్డి, శ్రీనివాస్, నరేశ్, ఓదెల రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘మాజీ ఎమ్మెల్యేవి అసత్య ప్రచారాలు’

పెద్దపల్లిరూరల్: ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సారథ్యంలో పెద్దపల్లి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుండడంతో జీర్ణించుకోలేకే మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అసత్యప్రచారం చేస్తున్నాడని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గడప గడపకు కాంగ్రెస్ అంటూ తిరుగుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రజలకు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాడన్నారు. పెద్దపల్లిలో ప్రస్తుతమున్న మార్కెట్ ఆవరణలోనే రూ.7కోట్లతో ఆధునిక మార్కెట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు కొనసాగుతుంటే మార్కెట్ స్థలాన్ని కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నాడని అనడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో ఉప్పు రాజు, శ్రీధర్, శ్రీకాంత్, జావిద్, సాబీర్‌ఖాన్, ఖదీర్‌ఖాన్, బొంకూరి మధు, కౌన్సిలర్లు ఇల్లందుల కృష్ణమూర్తి, లైసెట్టి భిక్షపతి, పూదరి చంద్రశేఖర్ తదితరులున్నారు.

మాజీ కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో మాజీ కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ కర్మాగారంలో మాజీ కాంట్రాక్ట్ కార్మికులకు కర్మాగారంలో ఉపాధి కల్పించకుంటే కర్మాగారం గేటు ముందు కుటుంబాలతో సహా ధర్నా చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేశ్వర్, వెంకటేశం పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

జ్యోతినగర్: తమ తోటి మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆ కుటుంబానికి మేము ఉన్నామంటూ మిత్ర బృందం రూ.లక్షా ముప్పై వేల రూపాయలు అందించి తమ స్నేహాన్ని చాటిచెప్పారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యనభ్యసించిన కట్కూరి వీరారెడ్డి(వీరన్న) అనారోగ్యంతో మృతి చెందాడు. వీరన్న మరణం మిత్రులను బాగా కలచివేసింది.. దీంతో మిత్రులందరూ కలిసి వీరన్న పిల్లల విద్య కోసం రూ.లక్షా ముప్పై వేల రూపాయలు జమ చేసి బాధిత కుటుంబానికి అందించారు. మిత్రుడిని ఆదుకునేందుకు అమెరికాలో ఉన్న మధుపతి ప్రభాకర్‌రావు యాభైవేల రూపాయలను అందించి తన స్నేహాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మిత్రులు సాదుల రాంబాబు, మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ రావు, విజేందర్ రెడ్డి, మనోహర్ రావు, కటకం కుమార్, దేవేందర్, వేణు ప్రసాద్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలి

జ్యోతినగర్: రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, ప్రభుత్వం మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ప్రీతిని గత కొంత కాలంగా ర్యాగింగ్ పేరుతో వేధించడం, అవమానించడం, చిత్రవధ చేయడంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని, చట్టాలు ఎన్ని ఉన్నా ఆత్మహత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. నిందితులు ఎంతటి వారైన ప్రభుత్వం చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు అభినందన

మంథని: ఈ నెల 26న కరీంనగర్ అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మంథనికి చెందిన కాకతీయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి తెలిపారు. కటా గ్రీన్ బెల్టు విభాగంలో ఏడో తరగతి విద్యార్థి వడ్లకొండ శ్రీనిత, వైట్ బెల్ట్‌లో నాలుగో తరగతి విద్యార్థి బండ రుత్వీక్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

వృథాగా తాగునీరు..


ట్యాంక్ నిండి వృథాగా పోతున్న తాగునీరు

పెద్దపల్లిరూరల్: తాగునీరందక ఎంతో మంది తల్లడిల్లుతుంటే.. పెద్దపల్లి మండలం చీకురాయి లోని వాటర్ ట్యాంకు నిండినా.. మోటారును ఆఫ్ చేయకపోవడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. మండలంలోని చీకురాయిలోని రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో ఈ తంతు నిత్యం కనిపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఈ వేసవిలోనైనా తాగునీటిని వృథాగా పోనియకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ధర్మారం: కరెన్సీపై బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని కరెన్సీ సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పర్శురాం అన్నారు. ప్రజాపోరు రథయాత్ర సోమవారం ధర్మారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. పార్లమెంట్ సమావేశంలో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించేందుకు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. పల్లె నుంచి ఢిల్లీ వరకు నిర్వహించే పాదయాత్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కరెన్సీ సాధన కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ బొల్లి స్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళా విముక్తికి పోరాడదాం

పెద్దపల్లిరూరల్: మార్చి 8న నిర్వహించుకునే మహిళాదినోత్సవాన్ని పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా కొందరు సాధించిన విజయాలను ప్రచారం చేస్తూ అసలు విషయాలను మరుగున పడేస్తున్నారని, ఈ క్రమంలో మహిళా దినోత్సవాన మహిళా విముక్తికి పోరాడాలని జేఎం డబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రమవిముక్తికి, పితృస్వామ్యానికి, సామ్రాజ్యవాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన పరిస్థితులు వచ్చాయని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగస్వామ్యం కావాలి

మంథని: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 1 నుంచి 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో మంథని ఐసీడీసీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొనాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి కోరారు. సోమవారం మంథనిలో విలేకరులతో మాట్లాడారు. రెండు నెలల క్రితమే అంగన్‌వాడీ సమస్యలపై ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినా స్పందించకపోవడంతో మూడు రోజులు సమ్మె చేయాలని యూనియన్ నిర్ణయించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బూడిద గణేశ్, వేల్పుల సురేశ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

గోదావరిఖని: జాతీయ రహదారులు తప్ప తెలంగాణలో మిగతా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమారపు అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసాలో భాగంగా ఫైవింక్లయిన్, విఠల్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ కాదు కదా రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో కల్లిబొల్లి మాటలతో ప్రచారానికి వచ్చే బీఆర్‌ఎస్ నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య, అసెంబ్లీ కోఆర్డినేటర్ గాండ్ల ధర్మపురి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు ఐత పవన్, వేల్పుల శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శిగా సంతోష్‌కుమార్

సుల్తానాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుల్తానాబాద్ కార్యదర్శి బూర్గు సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సంఘ సమావేశంలో ఆయనను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మండల సహవాస కమిటీ అధ్యక్షుడిగా డేవిడ్

ధర్మారం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పాస్టర్స్ కమిటీ సర్వసభ్య సమావేశంలో మండల సహవాస కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. అధ్యక్షుడిగా రేవ ఎస్ డేవిడ్, ఉపాధ్యక్షుడిగా యోహాన్, ప్రధాన కార్యదర్శిగా తిమోతి, ఉప కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా పాస్టర్ సాల్మన్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశానికి ధర్మపురి నియోజకవర్గ కమిటీ నాయకులు యోనా, సైమన్ పర్యవేక్షణలో ఎన్నుకున్నట్లు బిసప్ ఆమోస్ తెలిపారు.